క్లుప్తంగా

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరసింగరావు, భవన నిర్మాణ కార్మికులు

దాబాగార్డెన్స్: ఈ నెల 20న పిలుపునిచ్చిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో తామూ భాగస్వాముల మేనని భవన నిర్మాణ కార్మికులు తెలిపారు. సమ్మెను పురస్కరించుకుని సిటు నాయకుడు మంగళవారం నగరంలోని సింగ్ హోటల్ జంక్షన్ వద్ద సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మికులను రక్షించుకుందామనే నినాదంతో భవన నిర్మాణ కార్మికులందరూ సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మికులు పార్వతమ్మ, శ్రీను నాయుడు, సింహాచలం, పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

17,18 తేదీల్లో గైనకాలజీ సదస్సు

మహారాణిపేట: ఈనెల 17 నుంచి రెండు రోజుల పాటు హోటల్ రాడిసన్ బ్లూలో గైనకాలజీ సదస్సు జరగనుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ గైనకాలజిస్టులు, మహిళా ఆరోగ్య నిపుణులు, వైద్య విద్యార్థులు, పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొంటారు. ఫెడరేషన్ ఆఫ్ ఆబ్‌స్టెట్రిక్, గైనకలాజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా వేవ్స్-2025 పేరిట జరగనున్న ఈ సదస్సులో ఆధునిక లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, గర్భధారణ పద్ధతులు, మహిళల ఆరోగ్యం వంటి అనేక కీలక అంశాలపై సెషన్లు నిర్వహిస్తారు. ఈ సదస్సుకు డాక్టర్ కె. సుబ్బరాజు, డాక్టర్ టి. రాధ ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్లుగా వ్యవహరిస్తారు. 17 సాయంత్రం 5.30కి జరిగే ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హాజరవుతారు. కార్యక్రమంలో గైనిక్ వైద్యుల సంఘం విశాఖ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ పద్మావతి నాయుడు తదితరులు పాల్గొంటారు. ఆసక్తి గలవారు 98496 66803 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

రేపు విద్యార్థులకు పలు పోటీలు

మహారాణిపేట: ఈనెల 22వ తేదీన అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా 15వ తేదీన విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం ప్రకృతితో సామరస్యం, స్థిరమైన అభివృద్ధి అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నా మని జీవ వైవిధ్య మండలి జిల్లా కోఆర్డినేటర్ ఎస్.బాబూరావు తెలిపారు. చైర్మన్ ఎన్. విజయ్‌కుమార్, మెంబర్ సెక్రటరీ పి. రామకృష్ణ ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ సహకారంతో ఈ పోటీలను గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ పోటీలకు 8వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చు. ఇతర వివరాలకు 8985368180 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పిల్లలు, వృద్ధులకు అన్నసమారాధన



ప్రేమసమాజం పిల్లలకు అన్న సమారాధన నిర్వహిస్తున్న పైడి రజని

దాబాగార్డెన్స్: మానవత్వంలోనే దైవత్వం ఉందని, అభాగ్యులు.. నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు, స్థానిక ఏవీఎన్ కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని పిలుపునిచ్చారు. ఆమె జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రేమసమాజంలో 150 మంది పిల్లలు, వృద్ధులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన రోజు వేడుకలు ఇళ్లల్లో అట్టహాసంగా జరుపుకోవడం కంటే, వృద్ధాశ్రమం, ప్రేమసమాజం వంటి సంస్థల్లో నిర్వహించుకోవడంలో ఆనందం ఉందన్నారు. కార్యక్రమంలో రజని భర్త, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పైడి గోపాలరావు, ప్రేమ సమాజం నిర్వాహకులు పాల్గొన్నారు.

సరైన ఆహారంతో ఊబకాయం నియంత్రణ

ఏయూక్యాంపస్: సరైన ఆహారం తీసుకుంటూ ఊబకాయాన్ని నియంత్రించాలని పోషకాహార నిపుణురాలు డాక్టర్ రోహిణి పాటిల్ సూచించారు. బీచ్‌రోడ్డులో నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నోటికి రుచి కలిగించే ఆహార పదార్థాల వెనుక ఆరోగ్యానికి పెనుముప్పు దాగి ఉంటుందన్నారు. సరైన పోషకాలను సమపాళ్లలో ఎంపిక చేసుకుని, ఆహారాన్ని ఆస్వాదిస్తూ ఆరోగ్యవంతంగా జీవనం సాగించాలని సూచించారు. పెసర, శనగ గింజల నుంచి మొలకలు వచ్చిన ఆహారం, కూరగాయల సలాడ్‌లు, వేయించిన శనగలు వంటివి శరీర బరువును క్రమబద్ధీకరిస్తాయన్నారు.



నిత్యం భక్తుల రద్దీ ఇలా..



అన్నదానాలతో కళకళలాడుతున్న ఎర్నిమాంబ అమ్మవారి సన్నిధి



జ్ఞానాపురంలో వెలసిన అమ్మవారి ఆలయం

భక్తుల కొంగు బంగారం..

ఎర్నిమాంబ



నూతనంగా నిర్మించిన ఆలయం

- కోరిన వరాలిచ్చే కల్పవల్లి
- సంతాన లక్ష్మిగా పూజలందుకుంటున్న దైవం
- పలు ప్రాంతాల వారి ఇలవేల్పు
- నేడు తొలేళ్ల సంబరం.. ఆదివారం ప్రధాన జాతర



ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: సంతానం లేని దంపతులకు సంతానలక్ష్మిగా, కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారు కీర్తి గడించారు. గత వందేళ్లుగా అమ్మవారి చల్లని చూపు కోసం వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. జ్ఞానాపురం-అల్లిపురం లోని అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పుగా ఎర్నిమాంబ కొలువై ఉన్నారు. భక్తిశ్రద్ధలతో కొలిస్తే తమ కోరికలు నెరవేరుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. 17 శనివారం ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం. 18 ఆదివారం వైభవంగా ప్రధాన జాతర, 24 శనివారం భారీ అన్నసమారాధన, 25న మారువారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎర్నిమాంబ అమ్మవారి మాలధారుల సంఖ్య ఏడాది కేడాది రెట్టింపు అవుతోంది. అమ్మవారి ప్రాశస్త్యం వర్ధిల్లుతోంది.

అమ్మవారి ఆలయ చరిత్ర..

ఎనబై ఏళ్ల క్రితం విశాఖ కుగ్రామంగా ఉన్నప్పుడు అప్పటి భక్తులు చిన్న గుడి నిర్మించారు. ఈ ప్రాంతంలో తుప్పలు, డొంకల మధ్య అమ్మవారు వెలసినట్టు భక్తులు చెబుతారు. పదుల సంఖ్యలోనే ఇళ్లు ఉండడంతో చీకటి పడితే జనసంచారం ఉండేది కాదు. రాత్రి సమయంలో ఈ మార్గంలో వెళ్లేందుకు ప్రజలు భయపడేవారు. గత నలభై ఏళ్లుగా ఇక్కడ ఇళ్లు పెరగడంతో రోడ్లు విస్తరించాయి. ఆలయం పక్కగా జీవీఎంసీ అధికారులు రోడ్లు విస్తరించారు. వందేళ్లుగా ఆలయం ఉన్నప్పటికీ గత ఇరవై ఐదేళ్లుగా అమ్మవారిని భక్తులు విశేషంగా పూజిస్తున్నారు. ఎర్నిమాంబ అమ్మవారికి తొమ్మిది మంది అక్కచెల్లెళ్లు ఉన్నట్లు పూర్వీకులు చెబుతుంటారు. జ్ఞానాపురంతో పాటు అల్లిపురం లోని అచ్చియ్యమ్మపేట గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తారు. ప్రతి ఏటా మే మూడో ఆదివారం నిర్వహించే ప్రధాన పండగను అద్వితీయంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

భక్తుల కోలాహలం..

అమ్మవారిని పూజించే భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. ఆది, మంగళ, బుధ, శుక్రవారాల్లో దేవాలయం భక్తులతో కిటకిటలాడుతుంది. విశాఖ జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి తదితర జిల్లాల నుంచి కుడా భక్తులు అమ్మవారి సందర్శనార్థం వస్తున్నారు.ఆలయం వద్దే వంటా వార్పు చేసుకుని అమ్మవారి చెంతనే ప్రసాదాలు స్వీకరిస్తారు. అన్నీ శుభాలే జరుగుతాయనే ధృఢ సంకల్పంతో దురాబారాల నుంచి వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. స్థానికులే అమ్మవారి పేరిట సంఘాన్ని ఏర్పాటు చేసి పలు సేవలందిస్తున్నారు. 2007లో సంఘం సభ్యులే దేవాలయాన్ని ఎండోమెంటుకు అప్పగించారు. అప్పటి నుంచి అమ్మవారికి సేవలందించాలనే ధ్యేయంతో జ్ఞానాపురం ప్రాంతానికి చెందిన స్థానికులు సేవలందిస్తున్నారు. వంటవార్పులకు ఆయా సంక్షేమ సంఘ సభ్యులు మౌలిక వసతులు కల్పిస్తున్నారు.



అమ్మవారి సన్నిధిలో మాలలు వేస్తున్న గురుభవానీ నూకరాజు

మా ఇంటి ఇలవేల్పు..



చాలా కాలంగా మా ఇంటి ఇలవేల్పుగా ఎర్నిమాంబ అమ్మవారిని కొలుస్తున్నాం. అమ్మను దర్శించుకున్న తర్వాతే ఏ పనైనా చేస్తాం. భక్తిశ్రద్ధలతో పూజిస్తే అమ్మవారు కోరిన కోర్కెలు తప్పక తీరుస్తుంది. అమ్మవారి జాతర మహోత్సవంలో కుటుంబ సభ్యులతో మొక్కులు తీర్చుకుంటాం.

– నమ్మి పద్మావతి, భక్తురాలు, సీతంపేట

అమ్మ దీవెనలు మేలు చేస్తాయి..



మా తాతల కాలం నుంచి మా కుటుంబంలో అందరి పేర్లు ఎర్నిమాంబ అమ్మవారి పేర్లే. పుట్టిన ఇంట్లో ప్రతివారికి అమ్మ పేరే పెడుతున్నాం. సంతాన లక్ష్మిగా కొలుస్తున్నాం. అమ్మ దీవెనలు ఉంటే చల్లగా జీవిస్తాం. అమ్మను నిత్యం కొలుస్తాం. నమ్ముకున్న వాళ్లకు కొంగు బంగారంగా చల్లగా చూస్తుంది.

– విజినిగిరి రమణమ్మ, భక్తురాలు, కంచరపాలెం

మౌలిక సదుపాయాలు కల్పించాం..



ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలకు ఆలయ చైర్మన్, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. శనివారం జరిగే తొలేళ్ల సంబరాలు పూర్ణా మార్కెట్ దుర్గమాంబ ఆలయం నుంచి ప్రారంభం అవుతాయి. ఆదివారం జరిగే ప్రధాన జాతరకు భక్తులకు మౌలిక వసతులు కల్పించాం.

– డీవీఎస్ సురేష్‌బాబా, ఈవో, ఎర్నిమాంబ ఆలయం

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గణేష్ కుమార్ తదితరులు

మహారాణిపేట: గ్రామ, వార్డు సచివాలయ సెక్రటరీల పదోన్నతుల సమస్య పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ (ఏపీ ఎస్‌డబ్ల్యుఏఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ కోరారు. మంగళవారం అమరావతిలో జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ ఆనందరావు ఆధ్వర్యంలో రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్‌ను కలిసి వార్డు సెక్రటరీల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గడిచిన అయిదు సంవత్సరాల వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సేవను జూనియర్ అసిస్టెంట్‌గా పరిగణించి, అప్‌గ్రేడ్ చేయాలని, వారి తదుపరి ప్రమోషన్‌ను నోడల్ లేదా జోనల్ స్థాయిలో కొత్త పోస్టు సృష్టించి, సీనియర్ అసిస్టెంట్ పేస్కేలు కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, జనరల్ సెక్రటరీ శేషుబాబు, వైస్ ప్రెసిడెంట్ దుర్గా ప్రసాద్, స్టేట్ ట్రెజరర్ చింతకాయల బంగారు రాజు, స్టేట్ ఉమెన్ ప్రెసిడెంట్ కిరణ్మయి, జాయింట్ సెక్రటరీ పాండురంగ బెల్లంకొండ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా బల్లిగిరి పుష్పాంజలి



పుష్పాంజలి సేవలో పాల్గొన్న భక్తులు



విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం పుష్పాంజలి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జాము నుంచి బారులు తీరారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆలయ అర్చకుడు గొడవర్తి రగునాథాచార్యులు ఆధ్వర్యంలో దేవాలయాన్ని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. ఆలయ మండపంలో అష్టదళ పద్మారాధన, పాలికా ఉద్వాసన, ద్వాదశార్చనలు, విశేష నివేదనలు, ఆలయ ప్రదక్షిణలు చేపట్టారు. అనంతరం అర్చక స్వాములు నిర్వహించిన పూబంతుల ఆట భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామికి నివేదించిన విశేష హారతులు భక్తులను అలరించాయి. అనంతరం స్వామివారి పవళింపుసేవ కనుల పండువగా చేపట్టారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కీర్తనలు, గోవింద నామాలతో బల్లిగిరి మార్మోగింది. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ పిస్టల్, ఎయిర్ రైఫిల్ విజేతలకు సత్కారం



విజేతలతో వైఎంసీఏ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: ట్రూ షాట్ షూటింగ్ అకాడమీ, రైఫిల్ షూటింగ్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఎయిర్ పిస్టల్, ఎయిర్ రైఫిల్ పోటీల్లో వైఎంసీఏలో శిక్షణ పొందిన విజేతలను మంగళవారం ఘనంగా సత్కరించారు. జూనియర్ మెన్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన కోనా రోహిత్, సీనియర్ మెన్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన కేబీపీఎం కృష్ణ ప్రసాద్, జూనియర్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన కె. ఎలీషా పాల్, ఎయిర్ రైఫిల్ మాస్టర్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన కేవీఎస్ఎన్ మూర్తి, సబ్ యూత్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన మాస్టర్ ఎల్. గోవర్ధన్, సబ్ యూత్ ఉమెన్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన బి. లిని ఈషాను వైఎంసీఏ జాతీయ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రోలాండ్ విలియమ్స్ ఘనంగా సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎంసీఏ అధ్యక్షుడు డి. కృపాదాన్‌కుమార్, గౌరవ కార్యదర్శి జి. స్టీవెన్ పీటర్, గౌరవ కోశాధికారి రాకేష్ ఆనంద్, యాక్టివిటీస్ ఉపాధ్యక్షుడు కె. ఇజ్రాయిల్, బోర్డు డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మ జాతర ప్రారంభం



ఆకట్టుకున్న మహిళల నృత్యాలు



తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

అల్లిపురం: అమ్మవారివీధి ప్రజల ఆరాధ్య దైవం కొత్తమ్మ జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమయింది. దీంట్లో భాగంగా మంగళవారం భూలోకమ్మ పండగ అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం అమ్మవారి సతకం పట్టు నుంచి తిరువీధి ఉత్సవం మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో గోకుల్ థియేటర్ దరి భూలోకమ్మ అమ్మవారి దేవాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. ఉత్సవ విగ్రహానికి అమ్మవారివీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు మీదుగా అల్లిపురం మార్కెట్ రోడ్డు, నేరెళ్లకోనేరు జంక్షన్ మీదుగా తిరువీధి నిర్వహించారు.

మానవత్వం చాటుకున్న వాసుపల్లి

- జన సైనికుని భార్యకు రూ.10 వేలు ఆర్థిక సాయం
- పార్టీలకు అతీతంగా ఇంటికెళ్లి పరామర్శించి భరోసా కల్పించిన గణేష్‌కుమార్



రాజు తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: మానవత్వానికి నిజమైన నిదర్శనం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్. సేవాతత్పరతలో ఆయన కులమతాలు, పార్టీలు చూడకుండా సాయపడుతున్నారు. 34వ వార్డు భూపేష్‌నగర్‌కు చెందిన జన సైనికుడు కడితి రాజు (26) పెళ్లి జరిగి ఆరునెలలకే ఈ నెల 10వ తేదీన సూపర్‌బజార్ మేడపైన ఇండియన్ జిమ్‌కు సంబంధించిన ఫ్లెక్సీ కడుతూ పడి చనిపోయారు. వాసుపల్లి విషయం తెలుసుకుని అతని ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన భార్యకు సొంత నిధుల్లో నుండి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. మృతుడు కడితి రాజు తల్లి వెంకటలక్ష్మికి ఉన్న ఇద్దరు కుమారులు చనిపోయారు. భార్య కడితి లావణ్య చిన్న వయసులోనే భర్తను కోల్పోవడం వాసుపల్లిని కదిలించింది. తక్షణమే స్పందించి ఆర్థిక సాయంతో పాటు కుటుంబానికి అండగా నిలబడతానని భరోసా ఇచ్చారు. ఏ సహాయం కావాలన్నా తన వద్దకు రావాలని, లావణ్యకు ఉద్యోగావకాశం కల్పిస్తానని ధైర్యం నింపారు. వాసుపల్లి ఓదార్పుతో కన్నీటి పర్యంతమైన రాజు భార్య లావణ్య, తల్లి వెంకటలక్ష్మి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సౌత్ మున్సిపల్ విభాగం అధ్యక్షురాలు, 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, 29వ వార్డు నాయకుడు పీతల వాసు, 30వ వార్డు నాయకుడు దశమంతల మాణిక్యాలరావు, 33వ వార్డు నాయకుడు ముత్తబత్తుల రమేష్, 35వ వార్డు నాయకుడు అలపన కనకరెడ్డి, సౌత్ బూత్ కమిటీ, 39వ వార్డు నాయకుడు ముజీబ్ ఖాన్, ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ చైర్మన్ లండ రమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లింగం శీను, సౌత్ క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు సువార్త రాజు (సుబ్రహ్మణ్యం), సౌత్ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సూర్య నాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్, గుమ్మడి చంద్రమౌళి, వేణు, దూడ అప్పారావు, అంబటి అప్పలరాజు, సూరాడ లక్ష్మణ్, గార తాతబ్బాయి, ఏసారపు రాజు, ఈతల పాక మంజు, రామరాజు, చేపలరాజు, పార్టీ నాయకులు తదితరులు పాల్గున్నారు.

వీధి విక్రయదారుల సర్వేకు సహకరించాలి



జెడ్సీ మల్లయ్య నాయుడు

జగదాంబ: వీధి విక్రయదారుల సర్వే నిర్వహించనున్నట్లు జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు మంగళవారం తెలిపారు. జోన్ పరిధిలోని 28, 39 వార్డుల్లో స్ట్రీట్ వెండర్ సర్వే-2025 పేరుతో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ వీధుల్లో వ్యాపారాలు చేసుకునే వారందరూ సచివాలయ సిబ్బందికి సహకరించి సర్వేకి హాజరవ్వాలన్నారు. సర్వే అప్లికేషన్లు సచివాలయ సిబ్బంది దగ్గర ఉన్నాయన్నారు. సర్వేలో పాల్గొనే వ్యాపారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, మొబైల్ నంబర్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫ్యామిలీ ఫొటోలతో హాజరు కావాలని జెడ్సీ తెలిపారు.

యజమానులే స్వయంగా దరఖాస్తు చేసుకోవాలి



ఏసీపీ రుహాన్సీ

జగదాంబ: ఇంటి నిర్మాణానికి యజమానులే స్వయంగా దరఖాస్తు చేసుకోవాలని జోన్-4 అసిస్టెంట్ టౌన్ ప్లానర్ రుహాన్సీ తెలిపారు. గతంలో సర్వేలు, ఆన్‌లైన్‌లో ఇంటి నిర్మాణ ప్లాన్ దరఖాస్తు చేసుకునే వారని చెప్పారు. అయితే ఇప్పుడు ప్రభుత్వం ఇంటి యాజమానులే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. దీనివల్ల అదనపు ఖర్చులు తగ్గడంతో పాటు దళారులను నమ్మి మోసపోకుండా ఉంటుందన్నారు. అలాగే ప్లానింగ్ కోసం ఖర్చు వివరాలు స్వయంగా ఇంటి యాజమానే తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం జీవీఎంసీ జోన్-4 సూర్యాబాగ్ కార్యాలయం మూడవ అంతస్తులో సంప్రదించాలన్నారు.

వీర సైనికుల కుటుంబాలకు బ్రాహ్మణ సంఘం విరాళం



కలెక్టర్‌కు విరాళం అందజేస్తున్న సూర్యప్రతాప్, కోటేశ్వరరావు

మహారాణిపేట: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల సహాయార్థం సాయుధ దళాల యుద్ధ మరణాల సంక్షేమ నిధికి విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘం విరాళం ప్రకటించింది. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను కలిసి రూ.ఒక లక్ష 6,871 చెక్కును సంఘం అధ్యక్షుడు సుంకరణం సూర్యప్రతాప్, ప్రధాన కార్యదర్శి ముళ్లపూడి కోటేశ్వరరావు అందజేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర సైనికుల కుటుంబాలకు తోచిన సాయం అందించేందుకు సొమ్ము ఇచ్చామన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ జీడీ బాబు

దాబాగార్డెన్స్: మంగళవారం పాతనగరం రైతు మార్కెట్ ప్రాంతంలో విజయ దుర్గ మోటార్ యూనియన్ ఏర్పాటు చేసిన సమావేశంలో వన్‌టౌన్ సీఐ జీడీ బాబు పాల్గొని సైబర్ క్రైమ్ కేసులు, నేరాల నిరోధంపై అవగాహన కల్పించారు. పోలీసు అధికారులకు సహకరించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు, బీడీలు సేవించకూడదని పేర్కొన్నారు. ప్రజలు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, శాంతి భద్రతలు కాపాడే విధంగా సహకరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎక్కడైనా నేర కార్యకలాపాలు జరుగుతున్నట్టు అనుమానం వచ్చినా, లేదా జరగవచ్చని ముందస్తు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని సూచించారు. అనంతరం నాకాబందీ నిర్వహించి పలు వాహనాలు తనిఖీ చేశారు.

శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య : సీబీఎస్ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు విజయభేరి మోగించారని శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం ఎం.వి.సురేష్ తెలిపారు. శ్రేయస్ కుమార్ అనే విద్యార్థి 500 మార్కులకు గాను 498 మార్కులు సాధించి విశాఖపట్నం సిటీలో చరిత్ర తిరగరాశాడని పేర్కొన్నారు. 490కి పైగా మార్కులు 18 మంది, 487కి పైగా మార్కులు 31 మంది, 480కి పైగా మార్కులు 47 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా 450కి పైగా 179 మంది విద్యార్థులు సాధించారన్నారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సీమ, శ్రీచైతన్య కాలేజీల ఉత్తరాంధ్ర ఏజీఎం రమణ, రీజినల్ ఇన్‌చార్జి అలీ, రమణ, ప్రసాద్, కో-ఆర్డినేటర్ రాజేష్ అభినందించారు.